www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 3 నవంబర్ 2025
5
అన్నమయ్య



నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

దయనీయ స్థితిలో దళితవాడలు

- అభివృద్ధికి ఆమడ దూరంలో డిబిఎన్‌పల్లె ఎగువ, దిగువ దళితవాడలు
- సిసిరోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలు లేక అవస్థలు
- దూరంగా అంగన్వాడీ కేంద్రం
- వినియోగంలో లేని మంచినీటి ట్యాంకు
- విద్యుత్తు సరఫరా కూడా అంతంత మాత్రమే
- కన్నెత్తి చూడని అధికారులు, నేతలు



వాగును తలపిస్తున్న రెండు గ్రామాల ప్రధాన రహదారి



గుంతల మయమైన రోడ్లు

ప్రజాశక్తి-రాజంపేట

పట్టణానికి కేవలం అర కిలోమీటర్ దూరంలో ఉండే కూచివారిపల్లె, ఊటుకూరు గ్రామపంచాయతీ పరిధిలోని డిబిఎన్‌పల్లె ఎగువ , దళితవాడలు దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నాయి. కనీస వసతులు లేక గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా సిసి రోడ్లు, డ్రెయినేజీ లేకపోవడంతో ఇళ్లల్లోని నీరు తమ ఇళ్లముందే నిల్వ ఉంటోంది. వర్షపు నీరు కూడా చేరడంతో ఆ రెండు దళిత వాడల్లో వీధులన్నీ జలమయమై వాగులను తలపిస్తున్నాయి. పాలకులు, ప్రభుత్వాలు మారినా ఆ రెండు గ్రామాలు ఏమాత్రం అభివృద్ధికి నోచుకోక అనేక పారిశుధ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. దళితవాడను ఆనుకునే ఉన్న అగ్రకులాలకు చెందిన గ్రామంలో కేవలం ఒకే ఒక ఇల్లు ఉన్న వీధికి కూడా సిసి రోడ్లు ఏర్పాటయ్యాయి. వారికి అంతర్గత డ్రెయినేజీ వ్యవస్థ సైతం అందుబాటులో ఉంది. కానీ అదే గ్రామానికి చెందిన దళితవాడల్లో మాత్రం డ్రెయినేజీ వ్యవస్థ, సిసి రోడ్లు లేక పారిశుధ్య సమస్యలతో నిత్యం ప్రజలు అనారోగ్యబారిన పడుతున్నారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రం గ్రామస్థాయి నాయకుల నుంచి, అగ్ర నేతల వరకు ఓట్ల కోసం తమ గ్రామాలను సందర్శిస్తారే తప్ప తమకు కనీస మౌలిక వసతులు ఏర్పాటు చేసి గ్రామాభివృద్ధికి తోడ్పడే వారే లేరని, ఆ రెండు గ్రామాల దళిత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానొస్తే బయటికి అడుగు కూడా పెట్టలేని దుస్థితి ఆ రెండు గ్రామాలది. రెండు గ్రామాలకు నడుమ ప్రధాన రహదారిగా ఉన్న భారీ గుంతల మయమైపోవడంతో వానాకాలంలో ఆ దారి వాగులా మారిపోతుంది. దీంతో తాము ఊరంతా చుట్టి వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్లు, డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేస్తారని ఆశతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలోని అన్ని గ్రామాలను తీర్చిదిద్దుతున్నారు కానీ, పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న డిబిఎన్‌పల్లె దుస్థితిని ఆయన దృష్టికి తీసుకుపోయే నాథుడే లేడని, కనీసం మండల పరిషత్, పంచాయతీరాజ్ అధికారులైనా తమ గ్రామాలను సందర్శించి మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆమడ దూరంలో అంగన్వాడీ కేంద్రం..

చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టిక ఆహారం అందించడంతోపాటు వారి సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ, ఊటుకూరు గ్రామపంచాయతీ డిబిఎన్‌పల్లె దళితవాడలో మాత్రం ఇందుకు భిన్నంగా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కూడా డిబిఎన్‌పల్లె కమ్మ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు తరలించారు. గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమి ఉన్నా అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయలేక కొన్నాళ్లు అద్దె భవనంలో కేంద్రాన్ని నడిపి తర్వాత మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు తరలించారు. 0-5 సంవత్సరాల వయస్సున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలు సుదూర ప్రాంతంలో ఉన్న అంగన్వాడీ కేంద్రానికి వెళ్లలేక ప్రభుత్వం అందించే పౌష్టికాహారం అందుకోలేకపోతున్నారు. చిన్నారులు అక్షరాభ్యాసానికి దూరమయ్యారు. కొసమెరుపు ఏమిటంటే... సాధారణంగా అదే గ్రామానికి చెందిన కోడళ్ళు అంగన్వాడీ కేంద్రానికి కార్యకర్తలుగా నియమితులవుతారు. కానీ డిబిఎన్‌పల్లెలో ఇందుకు భిన్నంగా ఆ గ్రామం ఆ గ్రామ పంచాయితీకే సంబంధంలేని అగ్రకులాలకు చెందిన మహిళ ఇక్కడ అంగన్వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్నారు. దళిత వాడలో అనేకమంది విద్యావంతులైన, అర్హత కలిగిన మహిళలు ఉన్నప్పటికీ ఊటుకూరు గ్రామపంచాయతీకే సంబంధంలేని స్థానికేతురాలైన మహిళను అంగన్వాడీ కార్యకర్తగా ఎలా నియమించారో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకే తెలియాలని డిబిఎన్‌పల్లె వాసులు చెప్పుకొస్తున్నారు. గ్రామంలోని ప్రభుత్వ భూమిని గుర్తించి అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేసి, భవనం పూర్తయ్యే వరకు కనీసం అద్దె భవనంలో అయినా తమ గ్రామంలోనే అంగన్వాడీ కేంద్రాన్ని నడపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వినియోగంలో లేని మంచినీటి ట్యాంకు..

సుమారు 20 సంవత్సరాల కిందట కూచివారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని డిబిఎన్‌పల్లె దళితవాడలో అప్పటి నాయకులు పదివేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ మంచినీటి ట్యాంకును నిర్మించారు. దానికి ఎటువంటి పైప్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారు. అప్పటి నుంచి నేటి వరకు నిరుపయోగంగా దిష్టిబొమ్మల దర్శన మిస్తోందే తప్ప ఎటువంటి ప్రయోజనం లేదు. ట్యాంకుకు పైపు కనెక్షన్ ఇచ్చి వినియోగంలోకి తెస్తే రెండు గ్రామాల ప్రజలకు మంచినీటి సమస్య తీరుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

విద్యుత్ సరఫరా కూడా అంతంత మాత్రమే..

దళితవాడలు విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఆనుకునే ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరా అంతంత మాత్రమే. నిత్యం అకారణంగా కోతలు విధిస్తూ అసౌకర్యానికి గురిచేస్తున్నారని ప్రజలు చెప్పుకొస్తున్నారు. ఆ గ్రామానికి చిరునామా రాసేటప్పుడు సైతం ల్యాండ్ మార్క్‌గా నియర్ విద్యుత్ సబ్ స్టేషన్ అని సంబోధిస్తారు. సబ్ స్టేషన్ డిఇ కార్యాలయం అంత దగ్గరగా ఉన్నప్పటికీ అంతరాయం లేని విద్యుత్తు అందించడంలో అధికారులు విఫలమయ్యారని, విద్యుత్తు శాఖ పరిధిలో అర్బన్ కేంద్రంగా ఉన్న డిబిఎన్ పల్లెకు సరఫరా మాత్రం రూరల్ ఫీడర్‌తో అందిస్తూ ఉండడంతో ఈ సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. కోతలు, అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఆర్‌డిఎస్ పథకం సైతం ఆ గ్రామంలో ప్రారంభించలేదు. ఆ గ్రామానికి ఎంతో దూరంలో ఉన్న భువనగిరి పల్లెలో ఆర్‌డిఎస్ పథకం ద్వారా నిరంతరాయ విద్యుత్తు అందుతోంది కానీ, తమ గ్రామానికి ఎందుకు ఆ పథకం వర్తింప చేయలేదని గ్రామస్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రతి ఇంటికీ సౌర విద్యుత్తు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సూర్యఘర్ పథకం కూడా తమ గ్రామంలో అమలు కాలేదని, రెండు మూడు దఫాలు ఇంటింటికి వచ్చి సర్వే చేసుకొని వెళ్లారే తప్ప పథకం అమలుకు నోచుకోలేదని గ్రామస్తులు తెలిపారు. తమ గ్రామానికి అర్బన్ ఫీడర్ ఏర్పాటుతో గాని, సూర్య ఘర్ లేదా, ఆర్‌డిఎస్ పథకం ద్వారానైనా అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, రాజకీయ నాయకులు ఆ రెండు దళితవాడలపై దృష్టి కేంద్రీకరించి, కనీస మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తారో లేదో వేచి చూడాలి మరి.

రోడ్లు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి



మురుగు, వర్షపు నీరు చేరి వాగులా మారిన రోడ్లలో గుంత ఏదో, మిట్ట ఏదో తెలియక ద్విచక్ర వాహనంలో పలుమార్లు కిందపడి ఇబ్బందులు పడ్డాం. కనీసం నడిచి వెళ్లేందుకు కూడా అనువుగా లేని రోడ్లతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి సిసి రోడ్లు ఏర్పాటు చేయాలి.

-కత్తి కొండయ్య, స్థానికుడు

నాయకులకు మా సమస్యలు పట్టవు



మా గ్రామానికి రోడ్లు, డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని పలుమార్లు రాజకీయ నాయకులను కలిశాం. చూస్తామంటారే తప్ప కనీసం మా గ్రామాన్ని సందర్శించిన పాపనా పోలేదు. మా సమస్యలు వారికి పట్టవు. కేవలం ఎన్నికల సమయంలో ఓట్లు అడిగేందుకు మాత్రమే మా గ్రామాన్ని సందర్శిస్తారు.

-బాలిపోగు సుధాకర్, స్థానికుడు



నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

సాహిత్య సంపద పరిరక్షణ
అందరి బాధ్యత

బ్రౌన్ సేవలు తెలుగుభాషా సాహితీవేత్తలకు ఆదర్శనీయం
మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

భాషా, సాహిత్య సంపదను భావి తరాలకు వారసత్వ సంపదగా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఉప రాష్ట్రపతి, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత ఎం. వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం కడప సి.పి.బ్రౌన్ సాహిత్య పరిశోధన గ్రంథాలయాన్ని సందర్శించారు. సిపి బ్రౌన్ భాషాపరిశోధన కేంద్ర గ్రంథాలయ భవనంలోని జనుమద్ది సాహితీ పీఠం, అన్ని విభాగాలను సందర్శించి గ్రంథ పరిమళాన్ని ఆస్వాదించారు. ముందుగా యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న సి.పి.బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రంలో జానుమద్ది సాహితీపీఠం వారి సౌజన్యంతో ప్రతిష్టించిన తెలుగు సూర్యుడు, తెలుగు భాషా సముపార్జకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం సి.పి. బ్రౌన్ పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన ఛాయాత్రాలను ఒక్కొక్కటిగా తిలకించారు. గ్రంథాలయంలో నిక్షిప్తం చేసిన అమూల్యమైన, వెలకట్టలేని పురాతన తాళపత్ర గ్రంథ నిధిని, పరిశోధనా గ్రంథాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు బాషా సాహితీ సౌరభంలో మణి దీపంలా వెలుగొందుతున్న సి.పి.బ్రౌన్ భాష పరిశోధనా కేంద్రాన్ని సందర్శించడం తనకు చాలా సంతృప్తినిచ్చిందన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న సి.పి.బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రం విస్తరణాభివృద్ధికి, యూనివర్సిటీ భాషా పరిశోధక యంత్రాంగం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఆదరణ, ఔన్నత్యాన్ని కోల్పోయే స్థితిలో ఉన్న తెలుగు భాష సాహిత్యాన్ని పునర్లిఖించిన ఆంగ్లేయ సాహితీ శిఖరం 'చార్లెస్ ఫిలిప్ బ్రౌన్' అని, ఆయన సేవలు తెలుగు భాషా సాహితీవేత్తలకు ఆదర్శనీయం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతీర్మయి ప్రతాప, కలెక్టర్ డాక్టర్. శ్రీధర్ చెరుకూరి, వైవీయూ విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, కేంద్ర సాహిత్య ఆకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, శతావధానులు డాక్టర్ మెడసాని మోహన్, రేవూరి అనంత పద్మనాభ, 20 లక్షల పుస్తకాలను సేకరించిన అంకె గౌడ, ఆకాశవాణి పూర్వపు సంచాలకులు, గుమ్మడి గోపాలకృష్ణ, ఎస్‌బిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ హేమ, జానుమద్ది సాహితీపీఠం నిర్వా హకులు, కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, కెఎంసి కమిషనర్ మనోజ్‌రెడ్డి, బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు డాక్టర్ జి.పార్వతి, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా పురస్కారాల ప్రదానోత్సవం

అనంతరం డాక్టర్ జనుమద్ది హనుమచ్చాస్త్రి శత జయంత్యుత్సవం (1925-2025) సందర్భంగా 14వ సాహిత్య, గ్రంథాసల్య సేవా పురస్కారాల ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతీర్మయి ప్రతాప, సభ అధ్యక్షులుగాకేంద్ర సాహిత్య ఆకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, గౌరవ అతిథులుగా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి హాజరయ్యారు. వారితో వెంకయ్యనాయుడు తెలుగుభాషా ఔన్నత్యం, తెలుగు భాషా తీయదనం, కడప జిల్లా కళా సాహిత్య విశిష్టతను పంచుకున్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ళ ఆదినారాయణ రెడ్డి, రిజిస్ట్రార్ పద్మ, జానుమద్ది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వెంకయ్య నాయుడు చేతులమీదుగా పుస్తకావిష్కరణ

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సహాయ పరిశోధకుడిగా పనిచేస్తున్న డాక్టర్ చింతకుంట శివారెడ్డి రాసిన 'కడపజిల్లా స్వాతంత్ర్య సమరయోధులు, అలనాటి జ్ఞాపకాలు' పుస్తకాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆదివారం బ్రౌన్ గ్రంథాలయంలో ఆవిష్కరించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారి జీవిత చరిత్రలను భద్రపరచడం అవసరమన్నారు. ఇలాంటి పుస్తకాలు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు.

నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి,
50 ఏళ్లకే పెన్షన్ మాటేమిటీ?

- పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి -రాయచోటి



సమావేశంలో మాట్లాడుతున్న తులసి రెడ్డి

వృద్ధాప్య,వితంతు తదితర సామాజిక పింఛన్ల పంపిణీ సరే, మరి సూపర్ సిక్స్ హామీల్లో పేర్కొన్న నిరుద్యోగ భృతి, ఆడబిడ్డనిధి, 50 ఏళ్లకే పెన్షన్ మాటేమిటి పిసిసి అధికార ప్రతినిధి . డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ముఖ్యమంత్రిని సూటిగా ప్రశ్నించారు. ఆదివారం రాయచోటిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి పార్టీలు తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి కింద ప్రతి నిరుద్యోగి నెలకు రూ .3 వేలు రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని చెప్పారన్నారు. రాష్ట్రంలో దాదాపు రూ .20 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారున్నారు. అధికారంలోకి వచ్చి 16 నెలలైనా మూడు పైసలు కూడా నిరుద్యోగ భృతి కింద ఇవ్వలేదని వాపోయారు. నిరుద్యోగ యువతను నమ్మించి మోసగించిందని పేర్కొన్నారు. వచ్చే డిసెంబర్ 1 నుంచి అయినా బకాయిలతో సహా నిరుద్యోగ భృతిని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 19 - 59 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ .1500 ఆర్థిక సహాయం చేస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చాయని చెప్పారు. ఇప్పటివరకు రూ .15 పైసలు కూడా ఆర్థిక సహాయం చేయలేదున్నారు. తాము అధికారంలోకి వస్తే బిసి, ఎస్‌సి, మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటికీ ఈ హామీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల కింద దాదాపు రూ .6500 కోట్ల బకాయిలు ఉన్నాయిన్నారు. దీనివల్ల అటు కళాశాల యాజమాన్యాలు, ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా రూ .6500 కోట్ల రూపాయల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపిసిసి ప్రధాన కార్యదర్శి షేక్ అల్లాబకష్, రఫీ, చెన్న కృష్ణ, ఖాదర్, పూలరమణ, అజ్మతుల్లా, ఫరూక్, కె రెడ్డియ్య రాజు, కె.జనార్దన్, ప్రసాద్, నాగమణిరెడ్డి, హఫీజులా, ఇర్ఫాన్, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న,ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రసవత్తరంగా సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు

డ్రాగా ముగిసిన కడప, కర్నూల్ మ్యాచ్

ప్రజాశక్తి - కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్ - 14 మల్టీ డే మెన్ క్రికెట్ టోర్నమెంట్ రసవత్తంగా సాగుతోంది. వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కడప కర్నూలు జట్ల మధ్య నిర్వహించిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 125 పరుగులు చేసింది. రెండు వికెట్ల నష్టానికి 68 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 89.3 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 249 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని తాహిర్ 63, ఆష్ కాన్ 49 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని యశ్వంత్ సూర్య 3, అంకిత్ పరిక్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 31.0 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టానికి 58 పరుగులు చేసింది. ఆ జట్టులోని రిషి 22 పరుగులు చేశాడు. కడప జట్టులోని ముని నాగేశ్వర్ మూడు వికెట్లు తీసుకున్నాడు. మొదటి ఇన్నింగ్స్‌లో కడప జట్టు ఆధిక్యత సాధించింది. **నెల్లూరు, అనంతపురం మ్యాచ్ డ్రా..** కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్ లో నెల్లూరు జట్టు 186 పరుగులు చేసింది. మూడు వికెట్ల నష్టానికి 86 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 83.4 ఓవర్లలో 242 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని మోక్షజ్ఞ తేజ 84 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని శ్రీ చరణ్ రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 45.0 ఓవర్లలో వారు వికెట్లు నష్టానికి 159 పరుగులు చేసింది. ఆ జట్టులోని సమీర్ 59 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని రోహితేశ్వర్ రాజు మూడు వికెట్లు తీసుకున్నాడు. మొదటి ఇన్నింగ్స్ లో అనంతపురం జట్టు ఆధిక్యత సాధించింది.




తలపడుతున్న కడప, కర్నూలు జట్లు

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

ఎస్‌సి సంక్షేమ శాఖ అధికారి దామోదర్‌రెడ్డి

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి



జిల్లాలోని ఎస్‌సి సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు అందరికి అందుబాటులో ఉంటూ వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే తమ లక్ష్యమని ఎస్‌సి సంక్షేమ శాఖ అధికారి దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి సంక్షేమం కోసం విద్యార్థులకు విద్యను, సంక్షేమ పథకాలు మెనూ ప్రకారం పౌష్టికాహారం ఎలా అందిస్తున్నారో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

జిల్లాలో ఎస్‌సిసంక్షేమ వసతి గృహాలు, విద్యార్థులు వివరాలు తెలపండి ?

జిల్లా వ్యాప్తంగా ఎస్‌సి సంక్షేమ శాఖలో 55 వసతి గృహాలున్నాయి. ఇందులో ఆరు వసతి గృహాలు అద్దె భవనాలలో ఉండగా, మిగిలిన 49 భవనాలు సొంత భవనాలలోనే ఉన్నాయి. ఇందులో 3,029 మంది బాలురు,15,34 మంది బాలికలు జిల్లాలో మొత్తం 4,563 మంది విద్యార్థులు ఉన్నారు.

జిల్లాలో వార్డెన్లు, వంట మనుషులు ఎంతమంది ఉన్నారు? సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లాలో 42 మంది వసతి గృహ సంక్షేమ అధికారులు, 105 మంది నాల్గవ తరగతి ఉద్యోగులు పని చేస్తున్నారు.నాల్గవ తరగతి సిబ్బంది కొరత కొంత ఉంది.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఇతర కిట్లు పంపిణీ చేశారా ?

2025-26వ సంవత్సరానికి గాను 3వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులకు వసతి గృహ పుస్తకములు పూర్తిస్థాయిలో అందజేశాం. మిగిలిన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాలు ఇచ్చాం. విద్యార్థులకు ట్రంకుపెట్టెలు, గ్లాసు, ప్లేట్లు పంపిణీ చేశాం. బెడ్ షీట్ , కార్పెట్‌లు త్వరలోనే విద్యార్థులకు అందిస్తాం.

విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా?

విద్యార్థులకు ఎప్పటికప్పుడూ శుభ్రమైన నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందిస్తున్నాం. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి పూట భోజనం అందిస్తున్నాం.

విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు అందిస్తున్నారా?

జిఒ ఎంఎస్ నెం.09, సాంఘిక సంక్షేమ శాఖ, 20.02.2023 ప్రకారం విద్యార్థులకు కాస్మటిక్ ఛార్జీలు అందిస్తున్నాం. ప్రస్తుతం జూన్, 2025 వరకు కాస్మోటిక్ ఛార్జీలు విద్యార్థి, తల్లి ఖాతాకు జమ చేశాం.

కొన్ని వసతి గృహాలకు మౌలిక వసతులు లేవనే ఆరోపణలపై మీ స్పందన ?

అన్నమయ్య జిల్లాలో 43 వసతి గృహాలకు మరమ్మతులు (మరుగు దొడ్ల నిర్మాణం, విద్యు దీకరణ, నీటి సరఫరా, ఇతర పనులు) జరుగుతున్నాయి. ఇందు కోసం రూ .13.19 కోట్లు ప్రభుత్వం నుంచి దశల వారిగా నిధులు విడుదల అయ్యాయి. ప్రస్తుతం 15 వసతి గృహాలు మరమ్మతులు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. సంబంధితాధికారులకు ఈనెల 30లోపు పనులు పూర్తి చేయాలని సూచించారు.

విద్యార్థులకు, తల్లిదండ్రులకు మీరిచ్చే సూచనలు, సలహాలు?

ప్రతి నెలా విద్యార్థుల తల్లిదండ్రులతో సంబంధిత అధికారులు సమావేశాలు నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తు కార్యాచరణ గురించి వివరిస్తున్నాం. రాబోయే పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఉన్నందున తల్లిదండ్రులు పిల్లలని చీటికిమాటికి ఇళ్లకు తీసుకెళ్లకుండా వారు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా తోడ్పాటునివాలి.

'మనం' కృషి ఎనలేనిది : డిఇఒ

ప్రజాశక్తి రాయచోటి

విద్య, వైద్యం, జీవనోపాధితోపాటు పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపడుతూ మెరుగైన సమాజం కోసం ' మనం' సంస్థ చేస్తున్న కృషి ఎనలేనిదని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం డైట్‌లో మనం సంస్థ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ సభ్యులు తమ పాఠశాల నుంచి నేర్చుకున్న విలువలను సామాజిక సేవా రూపంలో తిరిగి సమాజానికి అందించాలనే నిబద్ధతతో పనిచేయడం గొప్ప విషయం అన్నారు. సామాజిక సేవకు అంకితమైన పూర్వ విద్యార్థుల వినూత్న ఆరంభం పలువురికి ఆదర్శప్రాయం అన్నారు. మనం సభ్యుడు దాసరి ఫణిధర్ చొరవతో అమెరికాకు చెందిన సేవా ఇంటర్నేషనల్ వారు 10 ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్‌లను మనం సేవా సంస్థకు అందజేయడం శుభ పరిణామం అన్నారు. అనారోగ్యానికి గురైన నిరుపేదలకు అత్యవసర సమయాల్లో ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రాయచోటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పునరుద్ధరణకు యోగాంజనేయ రెడ్డి చేసిన కృషి మరువరానిదన్నారు. కరోనా సమయంలో సభ్యులు చేసిన సేవ ప్రజల హృదయాలలో ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం మనం సంస్థ తరపున 4 ఎగ్జిక్యూటివ్ కుర్చీలను డైట్ కు అందించారు. కార్యక్రమంలో మనం సంస్థ వ్యవస్థాపకులు యోగాంజనేయరెడ్డి, డైట్ ఇన్చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, మనం ప్రెసిడెంట్ దేవేంద్రరెడ్డి, సభ్యులు వెంకటరామిరెడ్డి, జోషి, శ్రీనివాసులు, ఆంజనేయులు, గంగిరెడ్డి, కాశీ విశ్వనాథ రెడ్డి, వాణి, పద్మావతి, తమిళనాడుకు చెందిన శ్రీ ఆండాళ్ సేవా సమితి కి చెందిన సతీష్, మార్గబంధులతో పాటు మనం సభ్యులు పాల్గొన్నారు.



మనం సంస్థ సభ్యులతో డిఇఒ సుబ్రహ్మణ్యం



పాల డెయిరీని సందర్శిస్తున్న విద్యార్థులు

ఒకేషనల్ కోర్సులతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-రామాపురం


ఒకేషనల్ కోర్సులతో ఉపాధి అవకాశాలు కల్పించుకోవచ్చని కెజిబివి ప్రిన్సిపల్ పుష్పలత పేర్కొన్నారు. మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో చదువు తున్న 9,10, ఇంటర్ విద్యార్థినిలకు ఆదివారం ప్రిన్సిపల్ పుష్పలత అధ్యక్షతన ఇండస్ట్రియల్ సందర్శన ఫుడ్ ప్రాసెసింగ్ ట్రాక్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాల డెయిరీలను విద్యార్థులతో కలిసి సందర్శించారు. విజిట్‌పై ఒకేషనల్ ట్రైనర్ హిమబిందు పాల పర్సెంటేజ్ శుద్ధి చేసే విధానం, వెన్న శాతం తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

ప్రతి ఒక్కరూ తమ కళ్ళను జాగ్రత్తగా పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ మహమ్మద్, లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వ్యవ స్థాపక అధ్యక్షుడు పిఎస్ హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో పట్టణంలోని భరత్ స్పెషాలిటీ ఆస్పత్రిలో తిరుపతి అమెరికన్ ఐ హాస్పిటల్ వారి సహకారం ఉచితంగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ పోషకాహారం లోపం వల్ల 20 సంవత్సరాల పైబడిన వారందరికీ కంటి సమస్యలు వస్తున్నాయన్నారు. అందరూ ఈ విషయాన్ని గుర్తించి తమ కళ్ళను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలంటూ కోరారు. శిబిరంలో తిరుపతి అమెరికన్ ఐ హాస్పిటల్ వైద్యుల పర్య వేక్షణలో 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వారిలో 20 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం తిరుపతి కి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఇందాద్ అహ్మద్, కోశాధికారి మనో హర్ రాజు, క్లబ్ మాజీ అధ్యక్షులు నారాయణ రెడ్డి, సుందర్ రాజనాయుడు, సభ్యుడు రాధా కృష్ణతో పాటు రాయచోటి భరత్ స్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.


జనసేనలో చేరిన యువతతో మైఫోర్స్ మహేష్

జనసేనలో వంద మంది యువత చేరిక

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లి నియోజకవర్గంలోని వివిధ కళాశాలల్లో చదువుతున్న 100 మందికి పైగా యువకులు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఎపిఐఐసి డైరెక్టర్ మైఫోర్స్ మహేష్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు నిఖిల్ బెన్నీ, హేమంత్, లీలేష్, ప్రవీణ్ నాయుడు, శివ, నోయల్, సమీర్ తదితరుల ఆధ్వర్యంలో యువత పార్టీ కండువాలు ధరించి అధికారికంగా చేరికయ్యారు. ఈ సందర్భంగా మైఫోర్స్ మహేష్ యువతను సాదరంగా ఆహ్వానిస్తూ జనసేన కండువాలు కప్పి స్వాగతించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధితో పాటు సమాజంలో నైతిక విలువలతో కూడిన రాజకీయం కేవలం పవన్ కళ్యాణ్ గారి నాయకత్వంలోని జనసేన ద్వారానే సాధ్యమని నమ్మి యువత పెద్ద సంఖ్యలో పార్టీలో చేరడం ఆనందదాయకమైన విషయమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ చురుకుగా పనిచేయాలన్నారు. యువత పవన్ కళ్యాణ్ నాయకత్వంపై నమ్మకం, అభిమానం పెరుగుతుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. అనంతరం విద్యార్థి సంఘం నాయకులు మహేష్‌ను దుశ్శాలువాతో పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు విద్యాసాగర్, రమణ, నిఖిల్ బెన్నీ, హేమంత్, లీలేష్, ప్రవీణ్ నాయుడు, శివ, నోయల్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయాన్ని వృథా చేయరాదు

ప్రజాశక్తి - వేంపల్లె

పరీక్ష సమయంలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయరాదని సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఆదివారం పదోతరగతి విద్యార్థులకు మోటివేషనల్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను సాధించడానికి కలలు, కృషి, బాధ్యత, నిబద్ధత చాలా ముఖ్యమన్నారు. రాబోయే 2025-26 విద్యా సంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి కఠినమైన శ్రమ తీసుకోవాలన్నారు. ప్రణాళిక బద్ధంగా చదువు కోవాలని కోరారు. సమాజంలో ఉన్న ఇబ్బందుల్ని తొలగించడానికి విద్య చాలా అవసరమన్నారు. విద్యార్థి దశలోనే ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థుల ప్రగతికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల తరఫున సైకాలజిస్ట్ సుబ్రహ్మణ్యంను కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చేతన్‌రెడ్డి, శ్రీచైతన్యరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీ శనగలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

రాగిమానిపల్లె రైతు సేవా కేంద్రంలో ఎంపిటిసి విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో రైతులకు రాయితీ శనగ విత్తనాలను ఆదివారం ఎవో చెన్నారెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. శనగ విత్తనాల నాణ్యతను రైతుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎవో మాట్లాడుతూ పులివెందుల మండలానికి 500 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరు కాగా, అందులో 282 క్వింటాళ్లకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఆదివారం, సోమవారంలోపు పంపిణీ పూర్తి చేస్తామన్నారు. శనగ సాగు చేసే రైతులు విత్తే ముందు విత్తనశుద్ధి తప్పని సరిగా చేసుకోవాలని సూచించారు. విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్లతో పాటు భూమి ద్వారా సంక్రమించే తెగుళ్లను కూడా అరికట్టవచ్చని తెలిపారు. అనంతరం ఎర్రిపల్లె గ్రామంలో శనగ విత్తనాల నాణ్యతను పరిశీలించి, రైతులకు పంపిణీ చేశారు. రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు సేవ కేంద్రం సిబ్బంది శివ ప్రసన్న, అనూష, రైతులు పాల్గొన్నారు.

పెట్టుబడులు ఆకాశంలో..ధరలు పాతాళంలో..!



ప్రజాశక్తి-కలికిరి

గత యేడాది లాభాలు చవిచూసిన బొప్పాయి రైతులకు ఈసారి చేదు అనుభవం ఎదురైయింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సారి బొప్పాయి మంచి దిగుబడి వచ్చింది, కానీ మార్కెట్ ధర భారీగా పడిపోయింది. గతంలో వచ్చిన లాభాలను చూసి ఈసారి ఎక్కువ మంది రైతులు బొప్పాయి సాగు చేశారు. అక్టోబర్‌లో నెల నుంచి వర్షాలు కురవడంతో ఢిల్లీ మార్కెట్ కి ఎగుమతులు నిలిచిపో యాయి. దీనికి తోడు మహా రాష్ట్రలు బొప్పాయి దిగుబడి అధికంగా రావడంతో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారు. నెల క్రితం టన్ను రూ.10వేల నుంచి రూ.12వేలకు పలికిన ధర ప్రస్తుతం మూడు నుంచి నాలుగు వేలకు పడిపోయింది. కనీసం మార్కెట్ కు తరలించేందుకు రవాణా ఖర్చులు కూడా గిట్టుబాటు కాక పోవడంతో చేసేదిలేక రైతులు కాయలను చెట్లు పైన వదిలేస్తున్నారు.

అన్నమయ్య జిల్లాలో ముఖ్యంగా పీలేరు నియోజకవర్గం కలికిరి, కలకడ, పీలేరు, వాల్మీకిపురం మండలాల్లో రైతు టమోటా తరువాత బొప్పాయి పంటను అధికంగా పండిస్తున్నారు. ముఖ్యంగా కలికిరి మండలంలోని గుట్టపాలెం పంచాయతీలోని కె.భారీనేపల్లి, సి.బర్నేపల్లి, జి బరినేపల్లి వాడవాండ్లపల్లి రైతులు, మేడిగుత్తి పంచాయతీలోని కూకటి గొల్లపల్లి, మజ్జిగ వానపల్లి చీకటి పల్లి పంచాయతీలోని రంగనాథపురం గ్రామస్తులు అధిక సంఖ్యలో కలికిరి, కె.విపల్లి, పీలేరు వాల్మీకిపురం మండలంలోని భూములను ఎకరాకు రూ.50వేలు చొప్పున కౌలుకు తీసుకొని సుమా రుగా 350 నుంచి 500 ఎకరాల్లో బొప్పాయి పంటను పండిస్తారు. వారికి ఎకరానికి సుమారుగా రూ.2లక్షల నుంచి రూ.3లక్షల చొప్పున పెట్టుబడి పెట్టి సాగుచేస్తే దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడం దానికి తగ్గట్టు రేట్లు కూడా తగ్గిపోతుండడంతో రైతులు పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రాక అప్పులు పాలై దివాలా తీసే పరిస్థితి ఎదురైందని లబోదిబో మంటున్నారు. మళ్లీ యేడాది పంటలు వేయాలంటే మళ్ళీ అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

అగమ్యగోచరంగా బొప్పాయి రైతుల పరిస్థితి

పెట్టుబడులు కూడా రావడం లేదు



పదేళ్లగా లక్షలు ఖర్చుపెట్టి బొప్పాయి పంటను పండిస్తున్నాను. ఒక సంవత్సరం మంచిగా లాభాలు వస్తే, తరువాత రెండు మూడు సంవత్సరాలు దిగుబడి రాకపోవడం, గిట్టుబాటు రేట్లు లేకపోవడం, అకాల వర్షాలతో పంట పూర్తిగా నష్టపోయి లక్షల్లో నష్టం వస్తున్నాయి. పంటలు వేయాలంటేనే గుండె ధైర్యం చాలడం లేదు.

-వాడ యతేంద్ర యాదవ్, వాడవాండ్లపల్లి

ప్రభుత్వం పెట్టుబడి రాయితీ ఇవ్వాలి



బొప్పాయి పంటలు వేయడానికి లక్షల్లో ఖర్చు అవుతుంది. ప్రస్తుతం పెరిగిన పెట్టుబడులకు లాభాల కన్నా నష్టాలు ఎక్కువ రైతులు చవిచూస్తున్నారు. ఉద్యాన పంటలు వేసే రైతులకు ప్రభుత్వం రాయితీ చెల్లిస్తే మరింత ఉత్సాహంగా రైతులు పంటలు పండిస్తారు.

-బి.నాగరాజా, రైతు సి.బర్నేపల్లి గుట్టపాలెం

దుమ్ముతో భరించలేకున్నాం..మరమ్మతులు చేయించండి

- ◆ ప్రధాన రహదారిపై గ్రామస్తుల రాస్తారోకో

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలం మాధవరంపోడు గ్రామం ప్రధాన రహదారిలో రోడ్డు గుంతల పడి దుమ్ము ఇళ్లలోకి చేరుతోందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రోడ్డుపైకి వచ్చి నిరసన వ్యక్తం చూస్తూ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో కడప-తిరుపతి మార్గాలలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముందుగా ప్రధాన రహదారిలో రోడ్డు మరమ్మతులు చేసేందుకు గాను బాగా ఉన్న రోడ్డును కూడా గోకారని తెలిపారు. అనంతరం భారీ వర్షాలు పడడం వర్షపు నీరు రోడ్డుపై నిలబడి అధ్వానంగా తయారైందన్నారు. వర్షపు నరు ఇంకిపోయిన తర్వాత దుమ్ము విపరీతంగా రేగి దుమ్ము, దూళి ఇళ్లలోకి వచ్చి చేరడంతో తీవ్రమైన ఇబ్బం దులు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికా రులు తక్షణం చర్యలు తీసుకొని రోడ్డు మరమ్మతులు చేయాలంటు గ్రామ స్తులు కోరారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని గ్రామస్తులతో చర్చించి ఆందో ళనను విరమింపజేశారు. అనంతరం వాహన రాకపోకలను పునరుద్ధరించారు.


పోలీసులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు


రాస్తారోకోతో నిలిచిపోయిన వాహనాలు

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం :'చమర్తి'


జగన్‌మోహన్‌రాజుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-రాజంపేట

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామని రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని సీతారామపురం సర్పంచ్ థరూర్ కృష్ణ చైతన్య ఆహ్వానం మేరకు గ్రామంలో పర్యటించారు. అనంతరంగంగమ్మ తల్లి ఆలయ దేవస్థానం గోపురానికి శంకుస్థాపన చేసి, గ్రామస్తుల కోసం ప్యూరిఫైడ్ తాగునీటి కేంద్రాన్ని ప్రారంభించారు. దళితవాడ నుంచి కుప్పవారిపల్లి వరకు రూ.10 లక్షల నిధులతో గ్రామం రోడ్డును ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల కోసం సర్పంచ్ పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. గ్రామ అభివృద్ధికి పార్టీ పరంగా తాను అన్ని విధాల సహకరి స్తామని తెలియజేశారు.కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ సుబ్బనరసయ్యానాయుడు, రాజంపేట టిడిపి రూరల్ అధ్యక్షుడు మేడికొండ రవినాయుడు, ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి దగ్గుపాటి వెంకటేశ్వర్లునాయుడు, కోవూరు సుబ్రహ్మణ్యంనాయుడు, పోలి చెరువు నీటి సంఘం అధ్యక్షులు నాగినేని నాగేశ్వర్ నాయుడు, టెక్సమో మల్లిఖార్జున నాయుడు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి రాంనగర్ నరసింహ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజలకు భద్రత కరువు : వైసిపి

ప్రజాశక్తి-రాజంపేట

రాష్ట్రంలో ప్రజలకే కాకుండా సామాన్య భక్తులకు కూడా రక్షణ కరువైందని రాజంపేట వైసిపి నాయకులు పేర్కొన్నారు. ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శ్రీకాకుళం జిల్లా కాశి బుగ్గల్లో జరిగిన దుర్ఘటనకు నిరసిస్తూ వైసిపి నాయకులు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు పరిపాలన అంటే అన్ని వర్గాలు భయంతో బ్రతకాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజలు స్వేచ్ఛగా బ్రతికే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. చంద్రబాబు అధికారం చేపట్టినప్పటి నుంచి ఆయన చేత గానితనం, నిర్లక్ష్యం వల్ల పొలిటికల్ గవర్నెన్స్ పేరు చెప్పి కక్ష రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కక్షపూరిత రాజకీయాల కారణంగా రాష్ట్రంలో ఎంతోమంది చనిపోయారో చూస్తే ఆశ్చర్యం కలుగక తప్పదని తెలిపారు. ఓవైపు పాలన గాలికి వదిలేసి లా అండ్ ఆర్డర్ పర్యవేక్షణ చేయకుండా వదిలేయడం వల్ల ప్రజల భద్రత, మరీ ముఖ్యంగా దేవాలయాలకు వెళ్లే భక్తుల భద్రత ప్రశ్నార్థకంగా మారిపోయిందన్నారు. అత్యంత పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డులో కల్తీ నెయ్యి అంటూ చేసిన విష ప్రచారం మొదలుకొని సింహాచలం అప్పన్న సన్నిధిలో గోడకూలి భక్తులు మృతి చెందడం, శనివారం శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీ వెంక టేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట వరకు చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం, వైఫల్యాల కారణ మన్నారు. ఇప్పటికైనా ఆలయాలలో భక్తులకు భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి, డీలర్ సుబ్బరామిరెడ్డి, నవీన్, వడ్డే రమణ, ఖజముదీన్, సుబ్బరాజు, దయానంద్,మిరియాల సురేఖ, అమర, దాసరి పెంచలయ్య, దండు గోపి, రఘురామిరెడ్డి, జీవన్, జుబేర్, ఖాజా, మాధవ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

జిల్లాస్థాయికి విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మైదుకూరులో జరిగిన డివిజన్ స్థాయి షాట్‌పుట్, లాంగ్‌జంప్ పోటీల్లో మండలంలోని మల్లెపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు భరత్ కుమార్, ప్రణీత, హరిత, శ్వేత జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల హెచ్ఎం లక్ష్మీదేవి, స్కూల్ అసి స్టెంట్ సోమిరెడ్డిపల్లె ప్రవీణ్ (ఫిజికల్ సైన్స్), రాయపాటి పాపయ్య (సోషల్) తదితర ఉపాధ్యాయ బందం అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాపయ్య, ప్రవీణ్‌లతో పాటు గత పిఈటి విజయవాణి ప్రస్తుత పీడి శ్రీకాంత్ రెడ్డి సహకారంతో తాము జిల్లా స్థాయికి ఎంపికయ్యామన్నారు.

శ్రీశైలానికి ప్రత్యేక సర్వీసులు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

కార్తికమాసం సందర్భంగా ప్రతి సోమవారం మైదుకూరు ఆర్‌టిసి డిపో నుంచి ప్రత్యేక సర్వీసు నడుపునట్లు డిఎం శ్రీలత ఒక ప్రకటనలో తెలి పారు. సూపర్ లగ్జరీ సర్వీసు మైదుకూరు నుండి ఉదయం 6:15 నిమిషాలకు బయలుదేరుతుందన్నారు. మళ్లీ మధ్యాహ్నం శ్రీశైలం నుండి 1.50 నిమిషాలకు బయలుదేరుతుందన్నారు. జిల్లాలోని అన్ని శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

50శాతం రాయితీతో క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని మైదుకూరు, ఖాజీపేట, దువ్వూరు, చాపాడు, వనిపెంట సెక్షన్‌లలో విద్యుత్ వినియోగదారులు తాము ఇంటి అవసరానికి వాడుతున్న సర్వీసు మీద ఉన్న అదనపు లోడును 50 శాతం రాయితీతో డిసెంబరు 31లోపు క్రమబద్ధీకరించుకోవాలని సబ్ డివిజన్ అధికారి శ్రీకాంత్ తెలిపారు. జూలై 31తో ముగిసిన ఈ సౌలభ్యం ప్రజలకు మరికొంత కాలం అందుబాటులోకి ఉండాలన్న ఉద్దేశ్యంతో డిసెంబరు వరకు పొడి గించామన్నారు. ప్రజలు గమనించి ఆయా గ్రామానికి సంబంధించిన విద్యుత్ ఎఇని వెంటనే సంప్రదించాలన్నారు. ఈ అవకాశం ఉపయోగించుకోవాలన్నారు. వినియోగదారులకు గడచిన నెల మొదటి వారంలో ఇచ్చిన విద్యుత్ బిల్లుల చెల్లింపులకు అక్టోబర్-31తో గడువు ముగిసినందున ప్రజలు గమనించి సోమ వారం నుండి చెల్లింపులు చేయాలన్నారు. ఆలస్యం చేస్తే రోజుకు అపరాధ రుసుం వడ్డీతోపాటు సిబ్బంది విద్యుత్ సరఫరా తొలగించే అవకాశం ఉం దన్నారు. బకాయిలు ఉన్న ఎస్సీ, ఎస్టీ కాలనీల వినియోగదారులు తప్పక విద్యుత్ ఛార్జీలు చెల్లించాలన్నారు.

కాశీబుగ్గ మరణాలను సిఎం దాటవేయడం దురదృష్టకరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

శనివారం జరిగిన కాశీబుగ్గ మరణాలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మరణాలపై సిఎం చంద్రబాబు సులభంగా దాటవేయడం దురదృష్టకరమన్నారు. శనివారం ఏకాదశి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు వస్తారని ఏర్పాట్లు చేయకపోవడం ఖచ్చితంగా ప్రభుత్వ నిర్లక్ష్యమే అన్నారు. ఈ సంఘటనలో 9 మంది చనిపోవడం బాధాకరమన్నారు. దీనిపై మంత్రులు మాత్రం తమకు సంబంధం లేదని మాట్లాడడం అన్యాయ మన్నారు. దేవాదాయ శాఖ పరిధిలో ఈ ఆలయం లేనంత మాత్రాన ప్రభుత్వం శ్రద్ధ తీసుకోదా అని రాచమల్లు ప్రశ్నించారు. మొన్న తిరుమలలో, నిన్న సింహాచలం అప్పన్న సన్నిధిలో, నేడు కాశీబుగ్గలో అని పేర్కొన్నారు. వైసిపి నాయకులు పరామర్శకు వెళితే బయటకు పంపేయడం ఏంటని ప్రశ్నించారు. పలాస ఆసుపత్రి మొత్తం కూటమి అధీనంలోకి తీసుకున్నారని తెలిపారు. మృతుల ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షలు, గాయపడిన వ్యక్తికి రూ.10 లక్షలు నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాశీబుగ్గ మరణాలకు స్పందిస్తూ హోం మంత్రి రాజీనామా చేయాలని, సిఎం క్షమాపణ చెప్పాలని రాచమల్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

నకిలీ పత్రాల జారీపై కేసు నమోదు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో టైపిస్టు ప్రశాంత్ నాయక్‌పై నకిలీ పత్రాల జారీ చేసినందుకు ఫోర్జరీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐశ్రీనివాసులు తెలిపారు. తహసీల్దారు మహబూబ్ చాంద్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.ఫిర్యాదులో, టైపిస్టు ప్రశాంత్ నాయక్ తహశీల్దార్ దృష్టికి తేకుండా 27 మందికి నకిలీ ఇంటి నివాస అనుభవ పత్రాలు జారీ చేసినట్లు తెలిపారు. పేద ప్రజల నుంచి కుల, ఆధాయ, నివాస ప్రతాల కోసం డబ్బులు వసూలు చేశారని తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

శ్మశాన వాటికలో దారుణం

పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసిన గుజరాత్ యువకుడు

- పోలీసులకు అప్పగింత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజలను ఉలిక్కిపడేలా చేసిన ఓ దారుణ సంఘటన ఆదివారం మదనపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. మదనపల్లికి చెందిన దిలీప్‌రావు అనే వ్యక్తి శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహానికి ఆదివారం పట్టణ శివారులోని అంకిశెట్టిపల్లికి వెళ్లే మార్గంలో అంత్యక్రియలు చేసి వెళ్లిపోయారు. అంతా ముగిసిందనుకున్న సమయంలో గుజరాత్ రాష్ట్రానికి చెందిన గోవిందు అనే యువకుడు ఉదయం పూడ్చిన మృతదేహాన్ని వెలికి తీయటానికి ప్రయత్నిస్తుండగా గమనించిన కుటుంబ సభ్యులు అడ్డుకొని వారించడంతో అక్కడినుంచి వెళ్లిపోయాడు. తిరిగి మధ్యాహ్నం అక్కడికి చేరుకొని మట్టిలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికి తీయడతో గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు గోవిందను చితకబాది తాలూకా పోలీసులకు అప్పగించారు. పోలీస్ విచారణలో కొద్దిరోజుల కిందట మరణించిన తన చిన్నాన్న మహేష్ ఆత్మతో మాట్లాడటానికి, అప్పుడే మరణించిన దిలీప్‌రావు ఆత్మ తనకు కావాలని అందుకే ఆ మృతదేహాన్ని వెలికి తీయడానికి ప్రయత్నించానని చెప్పాడని తెలిపారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గోవిందు మానసిక స్థితిపై విచారణ చేపట్టినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం పుంగనూరు మండలంలో జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని ఈడిగపల్లి సమీపంలోని కమ్మోరుపల్లికి చెందిన సురేంద్ర భార్య రేఖ(36) గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యం తో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రులలో చూపించుకున్నా డబ్బు ఖర్చు తప్ప జబ్బు నయం కాలేదు. ఇక వైద్యం చేయించుకునే స్థోమత లేక తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు బాధితురాలిని వెంటనే స్థానిక మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి పరీక్షించిన వైద్యులు చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో రుయాకు రెఫర్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం పుంగనూరు పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పుంగనూరు మండలం, కాటిపేరి చిన్నారిగుంటకు చెందిన రైతు పగడాల గంగప్ప(65) టివిఎస్ ఎక్సెల్ వాహనంలో పుంగనూరుకి వెళ్లాడు. పెట్రోలు బంకు వద్ద మరో స్కూటర్ వేగంగా వచ్చి గంగప్పను ఢీకొట్టి వెళ్ళిపోయింది. తీవ్రంగా గాయపడిన బాధితుడిని స్థానికులు వెంటనే 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించేలోపే మృతి చెందాడు. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో ల్యాబ్ టెక్నీషియన్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పోతబోలు గ్రామం, శానిటోరియం సమీపంలోని సిద్ధమ్మగారిపల్లికి చెందిన వెంకటరమణ కుమారుడు కే.ఉపేంద్ర(35) మదనపల్లెలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఉపేంద్రకు భార్య కృష్ణవేణి, 10నెలల కుమారుడు ఉన్నాడు. కుటుంబ సమస్యలతో ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపారు.

ఆటో బోల్తా..మహిళకు గాయాలు

ప్రజాశక్తి- కలకడ

ఆటో బోల్తా పడి మహిళకు గాయాలైన సంఘటన మండలంలో జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పాటవారిపల్లి పంచాయతీ బాటవారిపల్లె జడ్‌పి హైస్కూల్ వద్ద పీలేరు నుంచి రాయచోటి వైపు వెళ్తున్న ఆటోకు కుక్క అడ్డు రావడంతో ఆటో బోల్తా పడినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో కడప జిల్లా చెన్నూరుకు చెందిన లక్ష్మీనరసమ్మకు బలమైన గాయాలైనట్లు 108 సిబ్బంది శ్రీనివాసులు, వెంకట చలపతి తెలిపారు. ఈమె చెన్నూరు నుంచి ఆటోలో చేపలు వేసుకుని వెళ్లి పీలేరులో అమ్ముకొని తిరిగి పీలేరు నుంచి చెన్నూరు వెళుతుండగా, మార్గమధ్యంలో బాట వారిపల్లి జడ్‌పి హైస్కూల్ వద్ద ప్రమాదం జరిగినట్లు తెలిపారు.బాధితురాలిని రాయచోటి ప్రభుత్వ వైద్యశాల తరలించి ప్రథమ చికిత్స అనంతరం అక్కడ నుండి మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్ కు తరలించినట్లు తెలిపారు. కలకడ పోలీసులు ప్రమాద స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పోలీసులపై దాడికి యత్నంచిన ఏడుగురిపై కేసు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

విచారణకు వెళ్లిన పోలీసులపై దాడికి యత్నించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ రవీంద్రబాబుతెలిపారు. రామపురం మండలం, నీలకంఠరావుపేట హైస్కూల్లో చదువుతున్న ఎస్‌సి బాలికను శనివారం వేధింపులు గురి చేశారనే బాలిక బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో నిందితుడి కోసం విచారణ వెళ్లిన పోలీసులపై బాబ్‌జాన్, వారి కుటుంబ సభ్యులు పోలీసులపై దాడికి యత్నించారని తెలిపారు. ఈ మేరకు బాబ్ జాన్, కుమారుడు సాహిద్ వారి కుటుంబ సభ్యులు ఏడుగురిపై కేసు నమోదు చేశామన్నారు. బాబ్ జాన్ కుమారుడు సాహిద్ నీలకంఠరావుపేట బాలికల హైస్కూల్లో చదువుతున్న ఓ బాలికను పాఠశాల వద్దకు వెళ్లి దురుసుగా ప్రవర్తించినందుకు బాలిక బంధువులు రామాపురంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రామాపురం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారని తెలిపారు. నిందితుడిది లక్కిరెడ్డిపల్లి కావడంతో లక్కిరెడ్డిపల్లె పోలీసులకు అప్పజెప్పగా స్థానిక పోలీసులు బాబ్‌జాన్ ఇంటికి వెళ్లి విచారణకు రమ్మనగా పోలీసులపై బాబ్ జాన్ కుటుంబ సభ్యులు దురుసు వ్యవహరించి దాడికి యత్నించారని తెలిపారు. ఈ మేరకు బాబ్ జాన్ , కుమారుడు సాదిక్ , కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. లక్కిరెడ్డిపల్లి, బాటమాదిగపల్లెకు చెందిన దళితులు కూడా బాబ్ జాన్, ఆయన కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పిపిపి విధానంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వ విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తూ కోటి సంతకాలతోనే వాటిని కాపాడుకోవాలని జడ్పిటిసి రవికుమార్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైసిపి మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక గాంధీ రోడ్డులో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య విద్య అనేది పేదలకు అందని ద్రాక్షలా కూటమి ప్రభుత్వం తయారు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి బుద్ధి వచ్చేందుకు ప్రజలందరూ సంతకాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నేతలు రామచంద్రారెడ్డి, కమతం రాజా, ప్రసాద్, **బ్రహ్మంగారి మఠం :** మెడికల్ కళా శాలలను ప్రయివేట్ పరం చేయ డాన్ని నిరసిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణలో ఆది వారం మండల వైసిపి నాయ కులు కార్యక్రమాన్ని చేపట్టారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డి పిలుపుమేరకు మైదు కూరు మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘు రామిరెడ్డి సూచనల మేరకు నాయకులు గ్రామాల్లో సంతకాల సేకరణ నిర్వహిస్తున్నారు.